క్లుప్తంగా

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

బెల్లంపల్లి: అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం బేషరతుగా కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి పట్టణ సీపీఎం కార్యాలయంలో శనివారం జరిగిన ఏరియా కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బెల్లంపల్లి ప్రాంతంలో గడిచిన వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయన్నారు. ఈ కారణంగా కల్లాల్లో ఆరబోసిన, కోత చేపట్టకుండా ఉన్న వరిధాన్యం నీటిలో తడిసి పోయాయని తెలిపారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు. రైతులు పండించిన ప్రతి వడ్ల గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం ఏరియా కార్యదర్శి జి.అశోక్ నాయకులు ఎ.రమణ, డి.రాజారాం ,సీ.హెచ్ .దేవదాస్. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై శ్యాంపటేల్

వేమనపల్లి: మావోయిస్టు పీఎల్‌జీఏ వారోత్సవాల సందర్భంగా నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ ఆధ్వర్యంలో వేమనపల్లి, నీల్వాయి రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. మండలం మహారాష్ట్ర సరిహద్దుగా ఉన్నందునా అపరిచిత, అనుమానిత వ్యక్తులపై ఆరా తీశారు. వారు ఎక్కడి నుంచి వస్తున్నారు.. ఎటు వెళ్తున్నారనే వివరాలు రాబట్టారు. వారి వద్ద సామగ్రి, గుర్తింపు కార్డులు తనిఖీ చేశారు. మంగెనపల్లిలో పల్లెనిద్ర చేపట్టి అసాంఘిక శక్తులకు సహకరించొద్దని సైబర్ నేరాలు, మూఢనమ్మకాలు, గంజాయి వాడకూడదని గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

'రైతులపై దాడిని ఖండిస్తున్నాం'

పాతమంచిర్యాల: పంజాబ్, హర్యానాలో రైతులు, కార్మికులు చేస్తున్న కవాతుపై పోలీసులు దాడి చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని భారత కార్మిక సంఘాల సమాఖ్యనాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. రైతులపై దాడి చేసినందుకు బీజేపీ మోడీ ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాంద్‌పాషా, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు భూమిపూజ



హరీశ్‌బాబును సన్మానిస్తున్న గ్రామస్తులు

భీమిని: మండలంలోని కేస్లాపూర్ గ్రామ పంచాయతీలో శనివారం సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్‌బాబు పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. సుమారు రూ.20లక్షలతో కొత్తగూడ, గట్టుపల్లి ప్రాథమిక పాఠశాలలకు, కేస్లాపూర్ అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ నిర్మాణం, రూ.10లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. వడాల నుంచి చిన్నగూడి పేట గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ధరణి వల్ల ఏర్పడిన భూ సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. నాయకులు నర్సింగరావు, లక్ష్మీనారాయణ, ధనుంజయులు, దామోదర్ గౌడ్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం మూర్ఖత్వం'



క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చెన్నూర్: తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం మూర్ఖత్వపు చర్య అని బీఆర్‌ఎస్ చెన్నూర్ నియోజకవర్గ నాయకులు రాజా రమేశ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపారాన్ని మార్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను మానుకోవాలన్నారు. స్థానిక తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, మాజీ సర్పంచ్ కృష్ణ, కౌన్సిలర్లు రెవెల్లి మహేశ్, తుమ్మ రమేశ్, మేడ సురేశ్‌రెడ్డి, మహేందర్, నాయబ్, నెన్నెల భీమయ్య, బొగె భారతి, జడల మల్లేశ్ పాల్గొన్నారు.

ఇందారం ఓసీపీ
ఉత్పత్తికి బీటలు

- వారహా కంపెనీ నిర్వహణ లోపం.. సంస్థకు నష్టం
- ఐకే–ఓసీపీ భవిష్యత్తు ప్రశ్నార్థకం
- అనుభవం లేని కంపెనీకి ప్రాజెక్టుల అప్పగింతతో పడిపోతున్న ఉత్పత్తి



ఐకే–ఓసీపీ



క్వారీలో నడిచే వాహనాలు

సంవత్సరం	వార్షిక లక్ష్యం	సాధించిన బొగ్గుఉత్పత్తి
2022-23	15 లక్షల టన్నులు	15 లక్షల టన్నులు
2023-24	15 లక్షల టన్నులు	12 లక్షల టన్నులు
2024-25	15 లక్షల టన్నులు	ఇప్పటివరకు 3లక్షల 30 వేల టన్నులు సాధించింది

జైపూర్: అతితక్కువ కాలంలోనే బొగ్గు ఉత్పత్తి సాధించి సింగరేణి వ్యాప్తంగా అనేక రికార్డులు బద్దలు కొట్టింది ఐకే–ఓసీపీ. ఏటా నిర్దేశిత లక్ష్యానికి మించి ఒక్కనెల ముందుగానే లక్ష్యాలు సాధించి శభాష్ అనిపించుకుంది. శ్రీరాంపూర్ ఏరియాకే మణిహారంగా మారిన ఐకే–ఓసీపీలో ఇప్పుడు బొగ్గు ఉత్పత్తికి బీటలు పడుతున్నాయి. ఓబీ ప్రాజెక్టుల్లో తక్కువ ధరకు టెండర్లు వేసిన అనుభవం లేని కంపెనీలకు అప్పగించడంతో నిర్వహణ లోపంతో సింగరేణికి తీవ్ర నష్టాన్ని మిగుల్చుతున్నాయి. ఐకే–ఓసీపీ దక్కించుకున్న వారహా కంపెనీ నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలుగుతోంది. దీంతో ఈ ప్రాజెక్టు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది.

- జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ భూగర్భగని సమీపంగా గోదావరి నది ఒడ్డున ఐకే–ఓసీపీని 2018లో ప్రారంభించారు. ఏడాదిలోపే బొగ్గు ఉత్పత్తి వెలికితీశారు. ఏటా నిర్దేశించిన లక్ష్యం మేరకు 15లక్షల టన్నులకు తగ్గకుండా బొగ్గు ఉత్పత్తి సాధిస్తూ వచ్చారు. మొదట ఓబీ కాంట్రాక్టు దక్కించుకున్న దుర్గ కంపెనీ ఆశించిన మేరకు బొగ్గు ఉత్పత్తి సాధించింది. మూడేళ్ల తర్వాత మళ్లీ టెండర్లు పిలవగా ఏడాది క్రితం కాంట్రాక్టు దక్కించుకున్న వారహా కంపెనీ తక్కువ ధరకు టెండర్లు దక్కించుకుంది. నిబంధన ప్రకారం ఓబీ మట్టి తవ్వకాలకు 6 డోజర్లు, 125 వాల్వో ట్రక్కులు నడిపించడానికి మూడు షిప్టుల్లో మ్యాన్‌పవర్ సరిపడా ఉండాలి. కానీ ఆ కంపెనీకి పెట్టుబడి పెట్టే పరిస్థితి లేదు. క్వారీలో కేవలం 2 డోజర్లు, 75 వాల్వో ట్రక్కులు మాత్రమే ఉండడం మ్యాన్‌పవర్‌ను మూడు షిఫ్టులో పద్ధతి ప్రకారం పని చేయించే సత్తాలేదు. ఇష్టారీతిన వ్యవహరించడంతో బొగ్గు ఉత్పత్తి మొత్తం పడిపోయింది. దీనికితోడు కార్మికులకు సరైన సమయంలో వేతనాలు చెల్లించకపోవడం, బోనస్, అలవెన్సులు రావడం లేదు. కార్మికులు సమ్మెకు దిగడం, కంపెనీకి చెందిన వ్యక్తులు చాకచక్యంగా వ్యవహరించలేదు. దీంతో బొగ్గు ఉత్పత్తి రాక సంస్థ నష్టపోతుండగా ఓబీ తొలగింపు చేపట్టాక కాంట్రాక్టు దక్కించుకున్న వారహా కంపెనీ సైతం నష్టాల్లోకి వెళ్తోంది. 30ఏళ్ల భవిష్యత్తు ఉన్న ఓసీపీ ఈ దుస్థితికి చేరడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

వైద్య శిబిరాలతో మెరుగైన వైద్యం

- ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

చెన్నూర్: నిరుపేదలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా మెరుగైన వైద్యం అందుతుందని స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. చెన్నూర్ మైనార్టీ ఫంక్షన్ హాల్లో గోదావరిఖని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. తనకు కూడా లయన్స్ క్లబ్ సభ్యత్వం ఉందని గుర్తు చేశారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే స్వయంగా రోగులను పరీక్షించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, లయన్స్‌క్లబ్ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు. అనంతరం చెన్నూర్ కస్తూర్బా గాంధీ కళాశాల టాపర్‌గా నిలిచిన నిరుపేద విద్యార్థిని మౌనికను ఎమ్మెల్యే సన్మానించారు.



చెన్నూర్: రోగులకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మందమర్రిరూరల్: మండలంలోని పొన్నారంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వివేక్ శనివారం శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని గుత్తేదారులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఎంపీడీవో రాజేశ్వర్, పొన్నారం స్పెషల్ ఆఫీసర్ సునీత, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి షష్టి వేడుకలు



వేంపల్లిలో వేడుకల్లో పాల్గొన్న అయ్యప్ప స్వాములు



దండేపల్లి: అష్టోత్తర శతకలశ పూజలు

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీ అభినవ శబరిమలై అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం సుబ్రమణ్య షష్టి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అష్టోత్తర శతకలశ పూజలు, సుబ్రహ్మణ్య హోమం, క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీవల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవాన్ని వైభవోపేతంగా జరిపించారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఆలయ వ్యవస్థాపక గురుస్వామి చక్రవర్తుల పురుషోత్తమాచార్యులు, అయ్యప్పస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లిలోని శ్రీభక్తాంజనేయ సహిత శివకేశవ ఆలయంలో శనివారం శ్రీ సుబ్రహ్మణ్యస్వామి షష్టి వేడుకలు అయ్యప్ప గురుస్వామి చింతపండు శ్రీనివాసస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆటోల బంద్ విజయవంతం



నినాదాలు చేస్తున్న ఆటో డ్రైవర్లు

దండేపల్లి/బెల్లంపల్లి(తాండూర్): రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించడం వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం తెలంగాణ రాష్ట్ర నాన్ పొలిటికల్ జేఏసీ ఇచ్చిన బంద్ పిలుపు తాండూర్, దండేపల్లి మండలాల్లో విజయవంతమైంది. ఆటో డ్రైవర్లు, యాజమానులు బంద్‌లో సంపూర్ణంగా పాల్గొన్నారు. ఆటోల బంద్ వల్ల ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ఆటో డ్రైవర్లు రోడ్డున పడాల్సి వచ్చిందని, సరైన గిరాకీ లేక రోజు వారీగా ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. ఆటో డ్రైవర్ల దీనస్థితిని చూసి ప్రభుత్వం ప్రతి డ్రైవర్‌కు నెలకు రూ.15వేలు జీవన భృతి చెల్లించాలని, రూ.1000కోట్లతో ఆటో కార్మికుల కోసం సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బెల్లంపల్లిలో ఆటోల బంద్ పాక్షికంగా జరిగింది. కొందరు డ్రైవర్లు సమ్మెకు మద్దతు ప్రకటించగా ఇంకొందరు యధావిధిగా ఆటోలను నడిపించారు.

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ వహించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఏసీఎంవో

కోటపల్లి: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంచిర్యాల జిల్లా ఏసీఎంవో రాజమౌళి అన్నా రు. కోటపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలను ఏటీడీవో పురుషోత్తంతో కలిసి ఏసీఎంవో ఆకస్మిక తనిఖీ చేసి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మిషన్ లక్ష్యం కార్యక్రమంలో భాగంగా పదిలో వందశాతం ఉత్తీర్ణ త సాధించాలన్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులతో పాటు స్లిప్ టెస్టులు నిర్వహించాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని ఉపాధ్యాయులు దత్తత తీసుకొని రాత్రి వేళల్లో బోధన చేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. పంటలకు నష్టం



మొర్రిగూడ సెంటర్‌లో తడిసిన ధాన్యం



నెన్నెలలో తడిసిన దూదిపింజెలు

నెన్నెల/బెల్లంపల్లి/వేమనపల్లి/జన్నారం/భీమిని/దండేపల్లి: ఎన్నో కష్టాలు పండించిన పంటలు వర్షార్పణం అయ్యాయి. నెన్నెల, బెల్లంపల్లి, జన్నారం, వేమనపల్లి, దండేపల్లి, భీమిని మండలాల్లో శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున, సాయంత్రం కురిసిన వర్షానికి చేతికందిన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రధానంగా పత్తి పంట తడిసి ముద్దవడంతో రంగు మారి నాణ్యత దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కూలీల కొరతతో చేలల్లో ఉన్న పత్తి చెట్ల నుంచి దూదిపింజెలు నేలరాలిపోయాయి. కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోయాయి. ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. వర్షానికి తడవకుండ ఉండేందుకు ధాన్యం కుప్పలపై కవర్లు కప్పుతూ రైతులు నానా తిప్పలు పడ్డారు. పూత దశలో ఉన్న కంది పంట నేలకొరిగి పూత రాలిపోయింది. ఇప్పటికే దిగుబడులు లేక అతలాకుతలం అవుతున్న రైతులకు ఈ వర్షం మరింత కుంగదీసింది. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పంట నష్టాన్ని అంచన వేసి పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. మందమర్రి సింగరేణి కాలనీల్లో పలు క్వార్టర్లలోకి వర్షపునీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

బొగ్గుబాయి వార్తలు

ఇంటి వద్దనే కౌన్సెలింగ్

శ్రీరాంపూర్: గైర్హాజరు కార్మికులకు అధికారులు వారి ఇంటికి వెళ్లి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్‌ఆర్పీ 1 గనిలో సంవత్సరంలో 100మస్టర్ల కన్నా తక్కువ డ్యూటీలు చేసిన కార్మికులను ఇటీవల గని మేనేజర్ కార్యాలయం వద్ద కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి సహాయ కార్యదర్శి కొమురయ్య పాల్గొన్నారు.

10న 'చలో ప్రజాభవన్'

శ్రీరాంపూర్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న చలో ప్రజాభవన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (సీఐటీయూ) శ్రీరాంపూర్ డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్ తెలిపారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని వద్ద శనివారం ఆయన కాంట్రాక్ట్ కార్మికులను కలిసి మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులకు 9లోగా వేతనాల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనియెడల పెద్ద ఎత్తున కాంట్రాక్ట్ కార్మికులు ప్రజాభవన్‌ను ముట్టడిస్తారన్నారు. కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద యెత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

పింఛన్ పెంచాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

శ్రీరాంపూర్: తమకు పింఛన్ పెంచాలని కోరుతూ సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు ఐఎన్టీయూసీ ముఖ్య నేతలకు వినతి పత్రాలు అందించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షుడు జీ సంజీవరెడ్డి, సింగరేణి విభాగం సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్‌ను కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు కలిసి శనివారం వినతిపత్రం సమర్పించారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాబురావ్, ఉప కార్యదర్శి వేణుమాధవ్, నాయకులు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'ఆక్రమణదారులు క్వార్టర్లు ఖాళీ చేయాలి'

బెల్లంపల్లి(తాండూర్): బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి, మాదారం టౌన్‌షిప్‌లలో కంపెనీ క్వార్టర్లలో అక్రమంగా నివశిస్తున్న వ్యక్తులు వెంటనే ఖాళీ చేయాలని ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా టౌన్‌షిప్‌లలో డీ, ఎస్‌డీ టైప్ క్వార్టర్లను కబ్జా చేసి కొందరు అక్రమంగా నివాసం ఉంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, విద్యుత్‌చౌర్యానికి పాల్పడుతున్నారని తెలిపారు. ఆయా రకాల కంపెనీ క్వార్టర్లు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. విద్యుత్ చౌర్యం వల్ల గతంలో పలు ప్రమాదాలు కూడా జరిగాయన్నారు. కంపెనీ క్వార్టర్లను బేషరతుగా ఖాళీ చేయాలని పలుమార్లు సూచించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఏదేనీ ప్రమాదం జరిగితే సింగరేణి సంస్థకు ఎలాంటి సంబంధం ఉండబోదని పేర్కొన్నారు.

సమాచారం

- **నేడు తాగునీటికి అంతరాయం**

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని పాతమంచిర్యాలలో ఆదివారం తాగునీటికి అంతరాయం కలుగుతుందని మున్సిపల్ ఇంజనీర్ మసూద్ అలీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాతమంచిర్యాల ట్యాంకు వద్ద మరమ్మతుల కారణంగా తాగునీటికి ఒక్కరోజు అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

- **నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం**

బెల్లంపల్లి: బెల్లంపల్లి విద్యుత్ డివిజన్ పరిధిలో ఆదివారం కరెంట్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ డీఈ రాజన్న ఒక ప్రకటనలో తెలిపారు. బెల్లంపల్లిలోని 132/33కేవీ సబ్ స్టేషన్‌లో పాత కండక్టర్ తొలగించి కొత్త కండక్టర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కారణంగా ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు బెల్లంపల్లి, తాండూర్, భీమిని, నెన్నెల, కాసిపేట, వేమనపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

- **ఏసీ బస్‌లలో 10శాతం చార్జీ తగ్గింపు**

పాతమంచిర్యాల: టీఎస్‌ఆర్టీసీ ఏసీ బస్‌లలో ప్రయాణించే ప్రయాణికులకు డిసెంబర్ 7 నుంచి 31వరకు ప్రయాణ చార్జీలో 10శాతం చార్జీ తగ్గించనున్నట్లు డిపో మేనేజర్ జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

- **9, 10, 11తేదీల్లో పత్తి కొనుగోళ్ల నిలిపివేత**

బెల్లంపల్లి: బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ఈ నెల 9, 10, 11 తేదీల్లో సీసీఐ ద్వారా చేపట్టిన పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎస్.భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అకాల వర్షాల కారణంగా పత్తి కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. తిరిగి ఈ నెల 12వ తేదీ నుంచి సీసీఐ కొనుగోళ్లు యధావిధిగా ప్రారంభమవుతాయని తెలిపారు. పత్తి రైతులు సహకరించాలని ఆయన కోరారు.

- **పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి రాజీనామా**

పాతమంచిర్యాల: పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఇన్నారెడ్డి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపా రు. ఉపాధ్యాయులకు సీపీఎస్ సాధనలో సఫలీకృతం కాలేకపోవడం, పాతపెన్షన్ సాధనలో విఫలమైనందుకు నిరసనగా జిల్లా అధ్యక్ష పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

- **అవినీతి అంతానికి కృషి చేయాలి**

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో ఈ నెల 8న అంతర్జాతీయ నిర్మూలన దినోత్సవం నిర్వహించనున్నట్లు శనివారం సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మోతే రాజలింగు తెలిపారు. అవినీతి అంతానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ నాయకులు సురేందర్, సునీల్, సునిల్‌రావు పాల్గొన్నారు.

- **పోస్టర్ ఆవిష్కరణ**

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మత్తు పదార్థాల నిర్మూలన ప్రచార పోస్టర్లతో పాటు ఈ నెల 14, 15 తేదీల్లో విజయవాడలో జరిగే జాతీయ మహాసభల ప్రచార పోస్టర్లను శనివారం హాజీపూర్ మండలం పద్దనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మణికుమార్‌తో కలిసి యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి ఆవిష్కరించారు. మత్తు, గంజాయి వంటి వాటి బారినపడి బంగారు భవితను అంధకారం చేసుకుంటున్నారని, మత్తు పదార్థాలను నిరోధించాల్సిన ఆవశ్యకతలో భాగంగా విద్యార్థులకు యూఎస్ ఎఫ్ఐ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు జిల్లా నుంచి భారీ సంఖ్యలో తరలివెళ్తున్నట్లు తెలిపారు. యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్, హాజీపూర్ మండల అధ్యక్షుడు డొల్క సాయితేజ, విద్యార్థి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాతమంచిర్యాల: 'మత్తు పదార్థాలను వ్యతిరేకిద్దాం–బంగారు భవిష్యత్‌కు బాట వేద్దాం' అని సీఐ ప్రమోద్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలో యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులతో కలిసి శనివారం మత్తు పదార్థాల నిర్మూలన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, జిల్లా అధ్యక్షుడు చెవ్వుటు మల్లేష్, డొల్క సాయితేజ పాల్గొన్నారు.

- **నేడు అయ్యప్ప పడిపూజ**

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ కాలనీలో అయ్యప్ప స్వాములు నగర సంకీర్తన చేపట్టారు. ఆదివారం ప్రగతి మైదానంలో అయ్యప్ప మహా మండల పడిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పడిపూజను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ శ్రీరాంపూర్ శాఖ అధ్యక్షుడు లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వీరబద్రు స్వామి, ప్రధాన కార్యదర్శి రాజేశంతో పాటు శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నాణ్యమైన భోజనం అందించాలి

చెన్నూర్/జైపూర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బీఆర్‌ఎస్ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజా రమేశ్ అన్నారు. ఫుడ్ పాయిజన్ కారణంతో విద్యార్థులు మృతి చెందుతున్న దృష్ట్యా శనివారం బీఆర్‌ఎస్ నాయకులు చెన్నూర్ మహాత్మా జ్యోతిభాపూ లే గురుకుల పాఠశాల హాస్టల్‌ను, జైపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాలను శనివారం సందర్శించారు. భోజనాన్ని తిని చూశారు. మెనూ ప్రకారం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు.

'ఎమ్మెల్యే వినోద్‌కు ప్రజలపై ప్రేమలేదు'

బెల్లంపల్లి: ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు మంత్రి పదవి మీద తప్పా, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలపై ఏమాత్రం ప్రేమ లేదని బీజేపీ నాయకులు విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన దీక్ష చేపట్టారు. బీజేవైఎం శ్రేణులు పురవీధుల మీదుగా బైక్ ర్యాలీ చేశారు.

బస్సు పునరుద్ధరించాలి

మందమర్రిరూరల్: మంచిర్యాల నుంచి మందమర్రి మీదుగా చిత్తాపూర్ వరకు వెళ్లే ఆర్టీసీ బస్సును పునఃరుద్ధరించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శివకుమార్, పట్టణ అధ్యక్షుడు రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ డిపో మేనేజర్ దేవపాలకు శనివారం వినతిపత్రం అందించారు.

డ్రాఫ్టు పోలింగ్‌స్టేషన్‌ల జాబితా ప్రదర్శన

కాసిపేట: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం స్థానిక సంస్థల ఎన్నికలు 2024కు సంబంధించి గ్రామపంచాయతీల వారీగా డ్రాఫ్టు పోలింగ్ స్టేషన్ల జాబితాను ఎంపీడీవో సత్యనారాయణసింగ్ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. ఇప్పటికే రాజకీయ నాయకుల అభ్యంతరాలు తీసుకున్నట్లు, పోలింగ్ స్టేషన్‌లపై ఎవరికి ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో షేక్ సబ్దర్ అలీ, సీనియర్ సహాయకులు ఆకుల లక్ష్మినారాయణ, కార్యాలయ సిబ్బంది తిరుపతి, తదితరులున్నారు.

అయ్యప్పస్వాములకు అన్నదానం

లక్సెట్టిపేట: మున్సిపల్ పరిధిలోని హనుమాన్ ఆలయంలో అయ్యప్ప స్వాములకు మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు షాహిద్ అలీ భిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. అయ్యప్ప స్వాములకు అన్నం వడ్డించి మత సామరస్యాన్ని చాటుకున్నారు.